

8లో

# విలువలు కాపాడుకోవాలి

సీపీకి ఎమ్మెల్యే రఘునందన్ రావు సూచన

విద్యార్థులపై దాడిచేయడంపై సీరియస్

కేసును తప్పుతోవ పట్టిస్తున్నారంటూ ఆగ్రహం


# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 70 శుక్రవారం | 08 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


# భరోసా లేని బతుకులు

## ఉసురు తీస్తున్న ఉద్యోగం

- గాలిలో దీపాలుగా హోంగార్డుల జీవితాలు
- కంటతడి పెట్టిస్తున్న వారి బాధలు
- మృత్యువుతో పోరాడి ఓడిన రవీందర్
- నా భర్త లాస్ట్ స్టేజీలో ఉన్నారంటూ వీడియో వైరల్
- ఆందోళనకు దిగకుండా అధికారుల చర్యలు
- సమ్మెకు దిగితే ఉద్యోగం ఊస్ట్ అంటూ హెచ్చరికలు





‘సీఎం సారూ.. నా భర్త సాయి కుమార్ లాస్ట్ స్టేజీలో ఉన్నారని డాక్టర్లు చెప్పారు. పిల్లలను హాస్టల్ లో ఉంచి చదివిస్తున్నాం..చాలా ఇబ్బందులు పడుతున్నాం.. నాలా చాలా మంది హోంగార్డులు తమ వ్యక్తిగత బాధలను చెప్పుకోలేక పోతున్నారు.. చాలీ చాలని జీతాలతో బతకలేకపోతున్నాం..’ హోంగార్డులను పర్మినెంట్ చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలంటూ కామారెడ్డి జిల్లా బాన్సువాడ పోలీస్ స్టేషన్ హోంగార్డు నాగమణి చేసిన వీడియో వైరల్ గా మారింది. హైదరాబాద్ లో హోంగార్డు రవీందర్ భార్య అనుభవిస్తున్న బాధను తాను కూడా అనుభవిస్తున్నట్లు ఆమె చేసిన విన్నపం పలువురిని కంటతడి పెట్టిస్తోంది. సమయానికి జీతం రావడంలేదంటూ మనస్తాపానికి గురై ఆత్మహత్యా ప్రయత్నం చేసి మృత్యువుతో పోరాడిన హోంగార్డ్ రవీందర్ తుది శ్వాస విడిచారు. ఈ సంఘటనలు హోంగార్డుల బతుకులకు అద్దం పడుతున్నాయి. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా హోంగార్డులను పర్మినెంట్ చేస్తానంటూ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి





వివరాలు 2లో..



8లో..

# బడుల్లో ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్

ఈ నెల నుంచే అమలుకు ప్రభుత్వం చర్యలు

టీఎస్ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా నమోదుకు శ్రీకారం



## మాణిక్ రావును కలిసిన ఇనగాల

హైదరాబాద్ గాంధీ భవన్ లో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇంచార్జి మాణిక్ రావు ఠాక్రెలను శుక్రవారం పరకాల నియోజకవర్గ ఇంచార్జి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికలకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. అనంతరం పరకాల నియోజకవర్గంలో తనకు కాంగ్రెస్ పార్టీతో ఉన్న అనుబంధం గురించి.. తాను పార్టీ కోసం చేసిన సేవలు, కార్యక్రమాలను వివరించారు.

- వరంగల్ వాయిస్, వరంగల్



2లో

# పశ్చిమ అభ్యర్థిగా రాకేష్ రెడ్డి దరఖాస్తు

భద్రకాళి గుడిలో ప్రత్యేక పూజలు

భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్ తరలిన నేతలు

# భరోసా లేని బతుకులు



- ఉసురు తీస్తున్న ఉద్యోగం
- గాలిలో దీపాలుగా హెూంగార్డుల జీవితాలు
- కంటతడి పెట్టిస్తున్న వారి బాధలు
- మృత్యువుతో పోరాడి ఓడిన రవీందర్
- నా భర్త లాస్ట్ స్టేజీలో ఉన్నారంటూ వీడియో వైరల్
- ఆందోళనకు దిగకుండా ఉన్నతాధికారుల చర్యలు
- సమ్మెకు దిగితే ఉద్యోగం ఊస్ట్ అంటూ హెచ్చరికలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** హెూంగార్డుల పరిస్థితి దయనీయంగా మారింది. పోలీసులతో సమానంగా పనిచేస్తున్నా సరైన గుర్తింపు, జీతం లేక ఇబ్బందులు తప్పడం లేదు. వీటితోపాటు అధికారుల వేధింపులు షరామామూలే అన్నట్లుగా మారాయి. ఎప్పుడో పెరిగిన జీతాలే ఇంకా అమలవుతున్నాయి. అవికూడా సమయానికి రాకపోవడంతో హెూంగార్డుల బతుకులు ఆగమవుతున్నాయి. అయితే హెూంగార్డులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తానంటూ 2017లో అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అటకెక్కింది. దీంతోసీఎం కేసీఆర్ చెప్పే మాటలకు మా బతుకులు మారతాయి.. మేం సంతోషంగా ఉంటామని ఎదురుచూసీ, చూసీ... మా బతుకులు ఇంతే ఇక మారవని తనువు చాలిస్తున్నాను. వచ్చే జీతం చాలక, ఆర్థిక సమస్యలతో సతమవుతూ ఆత్మహత్య చేసుకుంటున్నా..' అంటూ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలానికి చెందిన శివ అనే హెూంగార్డు సూసైడ్ నోట్ రాసి గతంలోనే తనువు చాలించగా చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెూంగార్డు రవీందర్ గురువారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు పాల్పడడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

## ఆర్థిక ఇబ్బందులతో రవీందర్ ఆత్మహత్య..

హెూంగార్డు రవీందర్ చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. గత రెండు నెలలుగా రవీందర్‌కు జీతం రావడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రవీందర్ పలుమార్లు ఉన్నతాధికారులను కలిసి జీతం గురించి, ఆర్థిక పరిస్థితి గురించి వివరించాడు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురైన రవీందర్ గోషామహల్‌లోని హెూంగార్డుల ప్రధాన కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి మంటలను ఆర్పివేశారు. రవీందర్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రవీందర్‌కు 60 శాతానికి పైగా గాయాలు అయినట్లు వైద్యులు తెలిపారు. పరిస్థితి మరింత విషమించడంతో కాంచన్ బాగ్ లోని అపోలో డీఆర్డీఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఊపిరితిత్తులు దెబ్బతినడంతో వెంటిలేటర్ ద్వారా వైద్యులు కృత్రిమ శ్వాస అందించారు. పరిస్థితి మరింత విషమించడంతో శుక్రవారం ఉదయం అతడు మృతి చెందాడు. అయితే ఉన్నతాధికారుల వేధింపులు వల్లే తాను ఆత్మహత్య చేసుకున్నట్లు మరణ వాంగ్మూలం కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే పోస్టుమార్టం నిమిత్తం రవీందర్ మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

## హెూంగార్డులకు వార్నింగ్..

రవీందర్ మృతితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హెూంగార్డులకు అధికారుల వార్నింగ్ ఇచ్చారు. ఆయన కుటుంబానికి మద్దతుగా ఆందోళనకు వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. హెూంగార్డులందరూ తప్పనిసరిగా డ్యూటీలో ఉండాలని హుకుం జారీ చేశారు. డ్యూటీలో లేని వారుసైతం పోలీస్ స్టేషన్‌కు రావాలని ఆర్డర్ వేశారు. హెూంగార్డులంతా అందుబాటులో ఉండేలా ఇన్ స్పెక్టర్లు ర్లు చర్యలు తీసుకోవాలని.. లా అండ్ ఆర్డర్‌లో పనిచేసే వారు సమ్మెకు సిద్ధపడితే విధుల నుంచి బహిష్కరిస్తామని, ఎవరైనా విధులకు రాకుండా ఉంటే వాళ్లను తొలగించాల్సి వస్తుందంటూ హెచ్చరికలు జారీ చేశారు.

## జేఏసీ ఆందోళన..

మరోవైపు హెూంగార్డు రవీందర్ మృతికి నిరసనగా.. హెూంగార్డుల జేఏసీ ఆందోళనకు పిలుపు నిచ్చింది. ఆయన కుటుంబానికి మద్దతుగా నిలవాలని నిర్ణయించింది. హెూంగార్డులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రవీందర్ మృతదేహంతో సచివాలయానికి వెళ్లేందుకు ప్లాన్ చేశారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఉస్మానియా ఆస్పత్రి దగ్గర భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఆత్మహత్య కాదు..హత్యే..: భార్య సంధ్య

హెూంగార్డు రవీందర్ మృతిపై ఆయన భార్య సంధ్య సంచలన ఆరోపణలు చేశారు. తన భర్తపై ఏఎస్సై నర్సింగరావు, కానిస్టేబుల్ చందు పెట్రోల్ పోసి తగలబెట్టారని ఆమె ఆరోపించారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తన పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఇది ఆత్మహత్య కాదు.. ఉన్నతాధికారులు చేసిన హత్య అంటూ ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తన భర్త ఫోన్‌ను తీసుకున్న పోలీసులు.. అందులోని డాటా మొత్తం ఎందుకు డిలీట్ చేయాల్సి వచ్చిందని సంధ్య ప్రశ్నించారు. తన భర్తతో మాట్లాడాకే చంపేశారని.. ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేయాలని సంధ్య డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఉస్మానియా ఆస్పత్రి ఎదుట ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# సత్తా చాటిన విష్ణువర్ధన్

### వ్యాస రచన పోటీలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం

### గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రధానం



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** గవర్నర్ తమిళిసై సౌదర్య రాజన్ నేతృత్వంలో నూతన విద్యా విధానం-2020 పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలో వర్ధన్నపేట సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆర్.విష్ణువర్ధన్ రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి ప్రథమ స్థానం పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం గవర్నర్ తమిళ సై చేతుల మీదుగా ప్రశాంస పత్రంతో పాటు రూ.10వేల నగదు పురస్కారం పొందారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థి ఆర్.విష్ణువర్ధన్ కు హనుమకొండ జిల్లా సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల రీజినల్ కో ఆర్డినేటర్ విద్యారాణి, వర్ధన్నపేట గురుకుల కళాశాల ప్రిన్సిపల్ ఖుర్షీద్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. మా గురుకుల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణంగా భావిస్తున్నామని, విష్ణువర్ధన్ లాగే గురుకులంలోని ఇతర విద్యార్థులను కూడా ఉత్తమంగా తీర్చిదిద్ది వర్ధన్నపేట గురుకులానికి మంచి పేరు తెస్తామని వారు అన్నారు. తల్లిదండ్రులు మాకు సహకరించాలని, విద్యార్థులు ఇలాంటి విజయాలు సాధించడానికి ఆసక్తి చూపించి గురుకులానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వారు విద్యార్థులను కోరారు.

# పశ్చిమ అభ్యర్థిగా రాకేష్ రెడ్డి దరఖాస్తు

### భద్రకాళి గుడిలో ప్రత్యేక పూజలు

### భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్ తరలిన నేతలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి శుక్రవారం దరఖాస్తు చేస్తుకున్నారు. ఉదయమే భారీ కాన్వాయ్ తో బయలు దేరిన ఆయన తొలుత భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి భారీ కాన్వాయ్ తో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. రాకేష్ రెడ్డి దేశంలోనే ప్రతిష్టాత్మకమైన రాజస్తాన్ బిట్స్ పిలాని నుంచి ఎంఎస్, ఎంఎంఎస్ జంట డిగ్రీ పట్టాలు పొందారు. కాలేజీ రోజుల్లోనే విద్యార్థి సంఘం జనరల్ సెక్రటరీగా అత్యధిక మెజారిటీతో గెలిచి తన సత్తా చాటారు. అనంతరం అమెరికాలో ఫేస్ బుక్, జేపీ మెర్గాన్ లాంటి అంతర్జాతీయ కంపెనీలో ఉద్యోగం చేశారు. అలాగే బెంగళూరు సిటీ బ్యాంక్ మేనేజర్ గా చేసి ఉద్యోగానికి స్వస్తి పలికి ప్రజా సేవ మీద మక్కువతో 2013 లో బీజేపీలో చేరారు. అనతి కాలంలోనే వారి శక్తి సామర్థ్యాలను గమనించిన పార్టీ బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ గా, రాష్ట్ర కార్యదర్శిగా అవకాశం ఇచ్చింది. 2016 లో తన వాక్పటిన, పార్టీ పట్ల నిబద్ధత, విషయ పరిజ్ఞానం గ్రహించి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించింది. నాటి నుంచి నేటివరకు గత ఏడు సంవత్సరాలుగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీకి సేవలందిస్తున్న నేపథ్యంలో ఈ సారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని ధరకాస్తు చేసుకున్నారు.



## వన్నాల వెంకటరమణ దరఖాస్తు..

వరంగల్ తూర్పు టికెట్ కోసం బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పార్టీ కార్యాలయానికి వెళ్లారు. తమ కుటుంబం మొదటినుంచి బీజేపీ పార్టీలో పనిచేస్తోందని, తనతండ్రి వన్నాల శ్రీరాములు వర్ధన్నపేట మాజీ ఎంఎల్ఏగా, పార్టీ కోసం వివిధ రాష్ట్రాల్లో ఎంతో కాలంగా సేవచేస్తున్నారని వెల్లడించారు. వరంగల్ తూర్పులో బీసీలు మెజారిటీగా ఉన్నారని, పద్మశాలీలు గెలుపోటములు ప్రభావితం చేస్తారని చెప్పిన డాక్టర్ వన్నాల వెంకటరమణ, తనను పార్టీ అభ్యర్థిగా ప్రకటిస్తే తూర్పులో కాషాయం జెండా ఎగురవేస్తావని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కనుకుంట్ల రంజిత్, మాదాసు రాజు, మార్టిన్ లూథర్, ఇనుముల అరుణ్, గోవింద్ సింగ్, మోహనాచారి, ఉపేందర్, పలు డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

# కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లను తక్షణమే భర్తరఫ్ చేయాలి

## విద్యార్థి జేఏసీ డిమాండ్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ లను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం భర్తరఫ్ చేయాలని కేయూ విద్యార్థి జేఏసీ డిమాండ్ చేసింది. శుక్రవారం కేయూ విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎస్ డీఎల్ సీ ప్రాంగణంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేయూ జాక్ చైర్మన్ తిరుపతి యాదవ్ మాట్లాడుతూ జాక్ నుంచి 10ప్రశ్నలకు వీసీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పీహెచ్ డీ కేటగిరీ -1 లో కేవలం ఫెలోషిప్, నెట్, సెట్ అర్హత వున్న ఫుల్ టైం రీసెర్చ్ స్కాలర్లకు రావాల్సిన అడ్మిషన్లకు ఇంటర్వ్యూలు పెట్టి, ఆ తర్వాత డబ్బులు చేతులు మారాక యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా డీన్స్ లతో రూల్సు మార్పించి, వాటిపై బలవంతంగా సంతకాలు చేయించి పార్ట్ టైం పీహెచ్ డీలు ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. పీహెచ్ డీ కేటగిరీ -1 అడ్మిషన్లు అక్రమని మళ్లీ అడ్మిషన్లు జరపవద్దని హై కోర్టు స్టే ఇచ్చినా కూడా కోర్టు ధిక్కరణకు పాల్పడి అడ్మిషన్లు జరపడం నిజం కాదా?, రిజిస్ట్రార్ వెంకట్ రామ్ రెడ్డిని కోర్టు ధిక్కరణ నేరం కింద హైకోర్టు కోర్టుకు రమ్మంది నిజం కాదా? అని అన్నారు. పీహెచ్ డీ కేటగిరీ -2 పరీక్షా పత్రం యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ లతో సంబంధం లేకుండా తయారు చేయించి ప్రతి విభాగంలో పదుల సంఖ్యలో ప్రశ్నలు తప్పుగా ముద్రించింది నిజం కాదా? అటువంటి పరీక్షల ఫలితాలు విద్యార్థులకు అంటగట్టి సీట్లు రాకుండా చేయడం నిజం కాదా? అన్నారు. పీహెచ్ డీ కేటగిరీ -2 ప్రశ్నా పత్రంలో దొర్లిన తప్పుల గురుంచి విద్యార్థి నాయకులు మాట్లాడితే కేసులు పెట్టించింది నిజం కాదా? వారికి సీట్లు రావద్దని ఇంటర్వ్యూ కమిటీలు నీకు అనుగుణంగా వేసుకొని పీహెచ్ డీ నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్వ్యూలు జరిపింది నిజం కాదా? అని ప్రశ్నించారు. కేయూ భూముల కబ్జాదారుల పై ల్యాండ్ కమిటీ రిపోర్టు సబ్మిట్ చేసినా కూడా భూ కబ్జా దారులతో (పెండ్లి అశోక్ బాబు) కుమ్మక్కై ల్యాండ్ కమిటీ రిపోర్టును పాలక మండలి ఆమోదానికి పెట్టకుండా పల్లా రాజేశ్వర రెడ్డితో పాలక మండలిని సభ్యులకు ఫోన్ చేయించి వారిని మచ్చిక చేసుకొని ల్యాండ్ కమిటీ రిపోర్టును మార్చే ప్రయత్నం చేస్తుండడం నిజం కాదా? అన్నారు. 19-07-2010లో ప్రొఫెసర్ అయి తేదీ 23.07.2019 (వీసీగా దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ) నాటికి 10 సంవత్సరాలు నిండకుండానే వీసీ కోసం అప్లై చేసుకొని పల్లా రాజేశ్వర రెడ్డి రూంమెంట్ అని అక్రమంగా వీసీగా మా ప్రాణాలు తీస్తుంది నిజం కాదా?, హైకోర్టులో కేసు ఉన్న మాట నిజం కాదా? కేసు జడ్జిమెంట్ వచ్చేంత వరకు వీసీగా తప్పుకునే దమ్ముందా? అదిలేక జడ్జిమెంట్ వచ్చే లోపల ఈ అవినీతికి పాల్పడడం నిజం కాదా? అని నిలదీశారు. యూనివర్సిటీ చట్టం సెక్షన్ 15.1 నిబంధనలకు తూట్లు పొడిచి ఒక రిటైర్డ్ ప్రొఫెసర్ ను రిజిస్ట్రార్ గా నియమించి, ఆయన్నే కీలక ఇతర పదవుల్లో పెట్టి నీ అవినీతికి ఆయనతో సంతకాలు చేస్తుంది నిజం కాదా? అని పేర్కొన్నారు. 1 మంది రిటైర్డ్ ప్రొఫెసర్లను యూజీసీ నిబంధనలకు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా అనుబంధ అధ్యాపకులుగా నియమించి కోటి రూపాయల అవినీతికి పాల్పడింది నిజం కాదా? నేర చరిత్ర ఉన్న వాళ్లను, వేరే యూనివర్సిటీలో రిజిస్ట్రార్ గా ఉన్న వాళ్లను నియమించింది నిజం కాదా? అని అన్నారు. మహిళా పీజీ కళాశాలలో విద్యార్థుల దగ్గరి నుండి డబ్బులు తీసుకొని చాలన్లు కడతామని లక్షల కుంభకోణం చేసిన అన్వేషిని అప్పటి కేయూ రిజిస్ట్రార్ త్రీ మెన్ కమిటీ వేసి ఉద్యోగం నుంచి తొలగిస్తే పల్లా రాజేశ్వర రెడ్డి దగ్గర డబ్బులు చేతులు మార్చి మళ్లీ ఆ ఉద్యోగిని పరీక్షల విభాగంలో నియమించి అవినీతికి పాల్పడింది నిజం కాదా...? అని నిలదీశారు. కొత్తగూడెం ఇంజినీరింగ్ కళాశాల నుంచి సీనియర్ ప్రాతిపాదికన కాకుండా డబ్బులు చేతులు మారాక ప్రొ.సదానందంను అక్కడి నుంచి కేయూకు బదిలీ చేసుకొని ఆయనను అవినీతిలో భాగస్వామ్యం చేయడం నిజం కాదా? పీహెచ్ డీ ఇంటర్వ్యూ కమిటీల్లో ఆయన్నీ పెట్టి విద్యార్థి నాయకులకు సీట్లు రాకుండా మార్కులు వేయించింది నిజం కాదా? అని ప్రశ్నించి వీటికి సమాధానాలు వీసీ చెప్పాలన్నారు. అవినీతిని ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులను టార్గెట్ చేసి పోలీసులతో అక్రమ కేసులు బనాయించి, పైశాచిక ఆనందం పొందుతూ, ఉద్యమాలను నీరు గార్చేందుకు విద్యార్థులకు ఆకస్మిక సెలవులు ఇస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుండడం నిజం కాదా? అని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న స్థానిక మంత్రులు ఎమ్మెల్యేలు స్పందించి వీసీ, రిజిస్ట్రార్ ను బర్తరఫ్ చేయాలని,లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రెస్ మీట్ అనంతరం కేయూ వీసీ రమేష్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ జాక్ నేతలు టీజీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ రంజిత్ కుమార్, గుగులోత్ రాజు నాయక్, గిరిజన శక్తిస్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మంద వీరస్వామి, కన్నం సునీల్, బీఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ బి.నరసింహారావు, పీడీఎస్ యూ జిల్లా కార్యదర్శి నిమ్మల రాజేష్, కేయూ ఏబీవీపీ ఇంఛార్జి సోల్తీ కిరణ్ గౌడ్, ఓబీసీ కో ఆర్డినేటర్ ఎండీ పాషా, కేయూ ఇంఛార్జి ఎన్ఎస్ యూఐ బొట్ల మనోహర్,కేయూ బీఎస్ఎఫ్ ఇంచార్జి రాకేష్ క్రిష్ణన్, కేయూ జాక్ అధికార ప్రతినిధి రంజిత్, పీడీఎస్ యూ నగర కార్యదర్శి బాషబోయిన వేణు రాజ్ పరుశురాం, విక్రమ్, రంజిత్, రమేష్, నరేష్, మధు దాడికి గురైన విద్యార్థులు మాచర్ల రాంబాబు, అరెగంటి నాగరాజు, అంకిల్ల శంకర్, మట్టెడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ అవకతవకలపై నిలదీస్తే దాడులా..

### మంగళపెల్లి హుస్సేన్

**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** ఇటీవల కాకతీయ యూనివర్సిటీలో జరిగిన పీహెచ్ డీ క్యాటగిరి-2 ఇంటర్వ్యూలలో జరిగిన అవకతవకలపై నిలదీసిన విద్యార్థులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదని నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు మంగళ పెల్లి హుస్సేన్ అన్నారు. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్ మెంట్ డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ అందరు కుమ్మక్కై ప్రభుత్వ ఉద్యోగుల విద్యార్థులకు మాత్రమే పీ హెచ్ డీ సీట్లు ఇచ్చారని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లపై మండిపడ్డారు. ఎంతో కాలం నుంచి పీహెచ్ డీ కోసం ఎదురుచూస్తున్న విద్యార్థుల ఆశలు అడియాశలు చేస్తూ ఇలాంటి సంఘటనలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. వెంటనే సీట్లపై వీసీ, రిజిస్ట్రార్ సమావేశమై నష్టపోయిన విద్యార్థిని విద్యార్థులకు న్యాయం చేయాలని పిలుపునిచ్చారు. న్యాయం జరిగేంత వరకు నేషనల్ హ్యూమన్ రైట్స్ సంఘం విద్యార్థుల పక్షానగా వారికి అండగా ఉంటామని తెలియజేశారు.

## ఘనంగా ఎమ్మెల్యే చల్లా జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** జనం మెచ్చిన నేత, జనం కోసం తపించే నేత.. ప్రజలు మెచ్చిన నాయకుడు, పరకాల నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, పరకాల శాసనసభ్యుడు చల్లా ధర్మారెడ్డి జన్మదిన సందర్భంగా నడికూడ మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, స్థానిక సర్పంచ్ ఊర రవీందర్ రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంపీపీ మచ్చ అనసూర్య రవీందర్, జడ్పీటీసీ కోడెపాక సుమలత కరుణాకర్, స్థానిక సర్పంచ్ ఊర రవీందర్ రావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు బొల్లె భిక్షపతి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు సుధాటి వెంకటేశ్వర్ రావు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు తిప్పర్తి సాంబశివ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు, బీముడి నాగిరెడ్డి, నందికొండ జయపాల్ రెడ్డి, పాడి ప్రతాప్ రెడ్డి, మండల, గ్రామ యూత్ నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అధ్యక్ష, కార్యదర్శులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రజకులకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తాం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉర్సు రజక సంఘం ఆధ్వర్యంలో ఉర్సు గుట్ట వద్ద మడెలయ్య దేవస్థానంలో రజక కుల పెద్దలు మొక్కులు సమర్పించి నైవేద్యం, పసుపు, కుంకుమ బొట్టు, పువ్వులు పెట్టి ఊదు పోగ వేసి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. 40వ డివిజన్ స్థానిక కార్పొరేటర్ మరుపల్ల రవి ముఖ్యఅతిథిగా విచ్చేసి మొక్కులు సమర్పించి కొబ్బరికాయ కొట్టిన తర్వాత మాట్లాడుతూ రజకుల ఆరాధ్యదైవం మడెలయ్య అని వారి ఇలవేల్పు పండుగ సందర్భంగా రజకులు అందరు చల్లగా ఉండాలని, వచ్చే మడెలయ్య పండుగ వరకు కమ్యూనిటీ హల్ నిర్మాణం చేపడుతామని రజకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొండమీది సారయ్య, కందుల బద్రి, కొండమీది ప్రసాద్, కొండమీది యాదగిరి, కొత్తకొండ శంకర్, కొండమీది రవి, కొండమీది రమేష్, కొండమీది రాజన్, కొండమీది రాజు బాబు, కొండమీది చక్రపాణి, కొండమీది శ్రీనివాస్, కొండమీది సతీశ్, కొండమీది యుగేందర్, కొండమీది రమేష్, గట్టికొప్పుల బాలు, కొండమీది సాగర్, కొండమీది సంపత్, కొండమీది గణేష్, కొండమీది చందర్, నాగేశ్వర్, కొండమీది వెంకటేష్, రాజు (రగోతం రెడ్డి హాస్పిటల్) తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తొర్రూరు, మరిపెడ, దంతాలపల్లి, పెద్ద వంగర పోలీస్ స్టేషన్లను శుక్రవారం జిల్లా ఎస్పీ చంద్ర మోహన్ సందర్శించి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ల పరిసరాలను, రికార్డ్స్, సిబ్బంది నిర్వహిస్తున్న విధులను తనిఖీ చేసి పరిశీలించారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ అవరణ, రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్ టీమ్, ఎస్ హెచ్ వో, లాక్ అప్, మెన్ రెస్ట్ రూమ్ తదితర ప్రదేశాలను తనిఖీ చేశారు. స్టేషన్ లో రోజు వారీగా నిర్వహిస్తున్న జనరల్ డైరీ, సెంట్రీ రిలీఫ్ బుక్, డ్యూటీ రోస్టర్, విలేజ్ రోస్టర్, ప్రాసెస్ రిజిస్టర్, బీట్ డ్యూటీ బుక్స్, సస్పెక్ట్ చెక్ రిజిస్టర్, సుపీరియర్ ఆఫీసర్స్ విసిటింగ్ బుక్స్, ఫైనల్ రిపోర్ట్స్ తదితర రికార్డ్స్ ను చెక్ చేశారు. పోలీస్ స్టేషన్ల లో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, సీడీ ఫైల్స్ ను పరిశీలించి, పెండింగ్ లో ఉన్న కేసులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

# లబ్ధిదారులకు గొర్రెల యూనిట్ల అందజేత

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సీఎం కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నదని అన్నారు. మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలో శుక్రవారం 36మంది యాదవ లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందజేశారు. గ్రామస్థులు ఎమ్మెల్యే శంకర్ నాయక్ కు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శంకర్ నాయక్ వారితో కలిసి డాన్స్ చేశారు. గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 20మంది శంకర్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతి పేద కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తూ అందరినీ ఆదుకుంటున్న గొప్ప సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పార్టీ కార్యకర్తలు, యాదవ కులస్తులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ వర్ధంతిని జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ 38వ వర్ధంతి సభలను గ్రామ గ్రామాన వాడవాడనా నిర్వహించి జయప్రదం చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి పున్నం సారయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో అమరవీరుల యాదిలో సెప్టెంబర్ 10 నుంచి 26వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని కరపత్రాన్ని తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పున్నం సారయ్య, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు నల్లూరి రామలింగం హాజరై మాట్లాడుతూ అమరవీరుల యాదిలో వీరనారి చిట్యాల ఐలమ్మ ఉద్యమంలో అసువులు బాసిన సత్తెనపల్లి రామకృష్ణలను స్మరించుకుంటూ గ్రామ గ్రామాన సభలు సమావేశాలు ర్యాలీలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలన్నారు. ఇటీవల రజక వృత్తిదారుల సంఘం నిర్వహించిన ఆందోళన పోరాటాల ఫలితంగా లాండ్రీ ఇస్త్రీ షాపుల దుకాణాలకు బొగ్గును, ప్రత్యేకంగా ఉచిత విద్యుత్ అందించే విధంగా చట్టాలను సాధించుకున్నామని అన్నారు. రాష్ట్రంలో 250యూనిట్ల ద్వారా సుమారు 75వేల మంది లబ్ధి పొందుతున్నారని, మరికొంతమంది అర్హులైన రజక వృత్తిదారులందరికీ ఉచిత విద్యుత్ అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంస్థలలో రజక వృత్తిదారుల రజక సొసైటీలకు ఇస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 102 విడుదల చేసిందని, దానిని పూర్తిస్థాయిలో అమలు చేసి రజకవృత్తిదారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపల్లి వెంకటేష్, తొర్రూరు మండల అధ్యక్షుడు నిమ్మల సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్, సహాయ కార్యదర్శి చింతల మధు, నాయకులు కొంగ్రాతి రామకృష్ణ, మడిపెద్ది కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## పీడిత ప్రజల విముక్తే అంతిమ లక్ష్యం

### చిట్టిపాటి వెంకటేశ్వర్లు




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** నేడు ప్రపంచంలో పెట్టుబడిదారీ శక్తులు రాజ్యమేలుతున్నాయని, ప్రపంచ ప్రజలందరినీ మూకుమ్మడిగా వీరు దోపిడీ చేస్తున్నారని, పెట్టుబడిదారీ సామ్రాజ్య వాద శక్తులను ఓడించకుండా పీడిత ప్రజల విముక్తి సాధ్యం కాదని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు బయ్యారం పార్టీ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఈ క్లాసులలో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు అనే అంశాన్ని చిట్టిపాటి వెంకటేశ్వర్లు బోధించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని వెనుకబడిన దేశాల అధినేతలను నయానా భయానా ప్రసన్నం చేసుకున్న సామ్రాజ్యవాద శక్తులు ఆయా దేశాల్లోని ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తూ వారిని నిలువు దోపిడీ చేస్తున్నాయని ఆయన అన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థకు పెద్దన్నలాగా వ్యవహరిస్తూ తమకు సహకరించని దేశాలపై దాడులు చేస్తున్నదని ఆయన అన్నారు. భారతదేశంలోని దళారీ పాలకులు సామ్రాజ్యవాదులతోటి కుమ్మక్కయ్యారని, డబ్ల్యూటీవో ఒప్పందంపై సంతకం చేసి సామ్రాజ్యవాదులు దోపిడీకి గేట్లు బార్లా తెరిచారని ఆయన విమర్శించారు. సామ్రాజ్యవాద అనుకూల విధానాలతో భారత పాలకులు కార్మిక, కర్షక తదితర పీడిత వర్గాలను అణచివేత, దోపిడీలకు గురిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలు కార్మిక చట్టాల రద్దు, అటవీ సంరక్షణ చట్టం, విద్యుత్తు బిల్లు లాంటివన్నీ కూడా ప్రజా వ్యతిరేక సంపన్న వర్గాల అనుకూల చట్టాలేనని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ మనువాద ఎజెండాను అమలు చేస్తున్నదని, అన్ని వ్యవస్థలను మనువాద శక్తులతో నింపుతున్నారని ఆయన విమర్శించారు. మైనార్టీలపై దాడులు కొనసాగిస్తూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిజాన్ని అమలు చేయపూనుకుంటున్నారని ఆయన అన్నారు. వామపక్ష లౌకిక శక్తులపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అనేకమందిని హత్య చేయడం, జైళ్లలో నిర్బంధించటం లాంటి చర్యలకు పూనుకొంటున్నారని అన్నారు. దేశంలోని బడా బూర్జువా, భూస్వామ్య శక్తులు ప్రపంచ పెట్టుబడీదారులతో కుమ్మక్కయ్యారని, కార్మిక కర్షక ఐక్యతతో వీరిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ క్లాసులకు పార్టీ జిల్లా నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ, జడ సత్యనారాయణ, ఊకె పద్మ అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, నాయకులు బూర్క వెంకటయ్య, ఆగబోయిన నర్సక్క, గుజ్జు దేవేందర్, శివారపు శ్రీధర్, యస్కె మదార్ సనప పొమ్మయ్య, గుజ్జు క్రిష్ణవేణి, తుడుం వీరభద్రం, బోనగిరి మధు, నేతకాని రాకేశ్, రామగిరి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## అనర్హులతో కూడిన దళితబంధు లిస్టు రద్దు చేయాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** గ్రామసభల ద్వారా దళిత బంధు, గృహలక్ష్మి లబ్ధిదారులను ఎంపిక చేయాలని , బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల అనర్హులతో అంతర్గత ఒప్పందాలను రద్దు చేయాలని, అర్హులైన లబ్ధిదారులు గుర్తించాలని సీపీఎం మండల నాయకుడు గోడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కేసముద్రం మండలం తాళ్లపూస పెల్లి గ్రామంలో దళిత బంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక అమలులో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, అధికారులు అంతర్గత ఒప్పందాలతో బయట నుంచి లిస్టు తయారు చేసుకుని వచ్చి సభలో చదవడాన్ని సీపీఎం పార్టీ మండల నాయకుడు గోడిశాల వెంకన్న, పలువురు లబ్ధిదారులు ఖండించారు. అనంతరం గ్రామసభను ఉద్దేశించి గోడిశాల వెంకన్న మాట్లాడుతూ గ్రామసభ ద్వారా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆందోళనకు దిగారు. పలువురు గ్రామస్తులు అర్హులైన పేదలు అధికారులు, ప్రజాప్రతినిధులు తయారుచేసిన లబ్ధిదారుల ఎంపిక లిస్టును రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం పోలీస్ అధికారులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న పలువురు లబ్ధిదారులను, సీపీఎం పార్టీ నాయకులను సభ నుంచి లాక్కొని వెళ్లి నిర్భంధించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పారదర్శకంగా పథకాలు అర్హులైన పేదలకు వర్తింపజేయాలన్నారు. లేకుంటే మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి,మండల ఆఫీసును ముట్టడిస్తామని గోడిశాల వెంకన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాల ఎలేంద్ర, ధర్మారం ఉపేంద్ర, కొమిరి చిన్న సైదయ్య, కొమరు ఉపేంద్ర, సట్ల ఉప్పలమ్మ, కందుకూరి అనిత, ఉమా, కందుకూరు ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ల పంపిణీ




**వరంగల్ వాయిస్, పరకాల :** ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదినం పురస్కరించుకొని పులిగిల్ల బీఆర్ఎస్ యూత్ నాయకులు శ్రీకాంత్, రసమల్ల మల్లికార్జున్, కోడిపాక నరేష్, కుసుంబ ప్రభాకర్, మోకిడి సుమన్, సంగ భిక్షపతి, పండుగ నవీన్, బండి మధుకర్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ లు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు అనంతరం మధ్యాహ్న భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ దేంగు రఘు, బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లే మహేందర్, గ్రామ ఉపసర్పంచ్ దయ్యాల కవిత లింగమూర్తి, వార్డు సభ్యులు భోజ కిషోర్ రెడ్డి, మూడెత్తుల నరేష్, కానుగుల వీరస్వామి, బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట బీజేపీ అభ్యర్థిగా పంజా వెంకటేశ్వర్లు దరఖాస్తు




**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు పంజా వెంకటేశ్వర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ కన్వీనర్ అర్షనపల్లి శ్రీరామ్ భూపాల్ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు జడ సతీష్, బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్ రెడ్డి, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, వర్ధన్నపేట మండల యువమోర్చా అధ్యక్షుడు చెంగల సురేష్ పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ తన సేవలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అదేవిధంగా పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తానని ఆయన అన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కృషి



**వరంగల్ వాయిస్, దోర్నకల్ :** అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రానిది దేశంలో అగ్రస్థానమని మున్సిపల్ చైర్మన్ వీరన్న పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా నిర్మిస్తున్న షాధిఖానకు రూ. 20లక్షల నిధులతో ప్రహరి గోడ, వంట షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అదే క్రమంలో ముస్లింల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పట్టణంలోని ముస్లిం సోదరుల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోటిలింగం, వార్డు కౌన్సిలర్లు జనార్దన్, సురేందర్, పర్వీన్ సుల్తానా సలీం, అశోక్, మౌలీ సుల్తాన్, కో ఆప్షన్ సభ్యులు మియా, రాంభద్రం, మైనార్టీ అధ్యక్షులు గౌస్, నాయకులు అఖిల్, ఖలీం, వాజీద్, ఖాదర్, అక్బర్, బాబా, బోడ హరిలాల్ పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సిరికొండ బ్రదర్స్



**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని రూప్ రెడ్డి పల్లి గ్రామానికి చెందిన కేసోజు అరుణ సదాశివాచారి కుమార్తె కేసోజు ప్రసన్న ప్రసాద చారి వివాహ వేడుకలో సిరికొండ బ్రదర్స్ పాల్గొన్నారు. శుక్రవారం రూపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీ సీతారామాంజనేయ ఆలయ ఫంక్షన్ హాల్ లో వివాహం జరగగా తెలంగాణ రాష్ట్ర సమితి యువజన నాయకులు సిరికొండ ప్రదీప్ కుమార్, సిరికొండ ప్రశాంత్, సిరికొండ క్రాంత్ కుమార్ పాల్గొని నూతన వివాహ జంటను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లెంకల రాజిరెడ్డి, వెంకట్ రాములు, బోయిన వినోద్, వావిలాల రమేష్, మేడిపల్లి అశోక్, కొండ సురేందర్, కొండ శ్రీనివాస్, పల్నాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి మదన్ లాల్ దరఖాస్తు




**వరంగల్ వాయిస్, డోర్నకల్:** డోర్నకల్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం కోసం బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గుగులోతు మదన్ లాల్ దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ లోని నాంపెల్లి బీజేపీ కార్యాలయంలో ఈ మేరకు శుక్రవారం దరఖాస్తు చేశారు. నెల్లికుదురు మండలం రతిరాం తండాకు చెందిన మదన్ లాల్ అక్కడి నుంచి ఎంపీటీసీగా గెలిచారు. కాకతీయ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజినీరింగ్ చదివిన మదన్ లాల్ ఏబీవీపి కార్యకర్తగా ఎన్నో విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నారు. కాకతీయ యూనివర్సిటీ జాక్ నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు, ఎన్నో విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వయంగా ఎమ్మెల్యే శంకర్ నాయక్ సొంత బావను ఓడించి జిల్లాలో సంచలనంగా మారారు. ఈ నేపథ్యంలో తనకు డోర్నకల్ నుంచి అవకాశం ఇవ్వాలని, పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానని అభ్యర్థిత్వాన్ని సమర్పించుకున్నారు. కాగా బీజేపీ అధిష్టానం దృష్టిలో యువకుడు, తెగింపు ఉన్న కార్యకర్తగా మంచి గుర్తింపు ఉంది.

# గుంతను తవ్వారు.. పూడ్చడం మరిచారు

## తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

## పైప్ లైన్ లీకేజీతో వృథాగా పోతున్న తాగునీరు




**వరంగల్ వాయిస్, మడికొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని ఖండాల దాబా, సుచి టిఫిన్ సెంటర్ వద్ద పక్కన వీధిలోనికి వెళ్లే రహదారిలో మున్సిపల్ పైప్ లైన్ లీకేజీని అతకడానికి మున్సిపల్ సిబ్బంది తీసిన గుంతనే అలాగే అసంపూర్ణంగా పూడ్చారు. దీంతో గుంత పెద్దదిగా ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటువైపుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని మండిపడుతున్నారు. అతికిన పైపులైను లీకేజీతో మంచినీరు వృథాగా పోయి గుంత పెద్దదిగా మారుతోంది. భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ సిబ్బంది, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పైప్ లైన్ లీకేజీ మరమ్మతును సరిగా చేసి, అసంపూర్ణంగా ఉన్న గుంతను పూడ్చేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. .



# మరమ్మతులు చేపడతామని కలెక్టర్ హామీ



**వరంగల్ వాయిస్, రేగొండ :** మరమ్మతులు చేపడతాం, పది రోజులు గడివివ్వండని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారని తిరుమలగిరి గ్రామ సీపీఐ పార్టీ శాఖ కాంగ్రెస్ పార్టీ శాఖ యువజన సంఘాల నాయకులు కొడుదుల వెంకటేష్, చిగురుమామిడి మోహన్, నిమ్మల విజేందర్, పల్నాటి శ్రీనివాస్ సిరిపురం శివ తెలిపారు. గత రెండు నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు తిరుమలగిరి గ్రామం నుంచి జాతర వరకు అటు పాండవుల గుట్ట నుంచి జాతర వరకు రోడ్లు వరద ఉధృతికి లోయలు కోసి రోడ్లు తెగాయి. నెలలు గడుస్తున్నా స్పందించని తిరుమలగిరి ప్రజాప్రతినిధులు, గ్రామ అభివృద్ధిని మరిచిన బీఆర్ఎస్ నాయకుల వైఖరికి నిరసనగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సెంటర్ వద్ద సీపీఐ నాయకులు నిరసన తెలియజేశారు. గ్రామ సమస్యలను విస్మరించిన ప్రజా ప్రతినిధుల వైఖరి విడనాడాలని స్థానిక జిల్లా కలెక్టర్ ను కలిశారు. నేడు వారు స్పందిస్తూ ఇంకా భారీ వర్షాలు ఉన్నాయని మరమ్మత్తులు చేస్తే మళ్లీ ఇలాంటి పరిణామాలు ఏర్పడతాయని, పది రోజుల్లో వర్ష నమోదు శాతం తగ్గుతుందని అనంతరం తిరుమలగిరిలో తెగిన రోడ్లకు మరమ్మతులు చేస్తామని సానుకూలంగా స్పందించారని వారన్నారు. గ్రామ సమస్యల పైన ఉన్నతాధికారులు స్పందిస్తున్నారే తప్ప ఓట్లు వేసి ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధి కోసం పని చేసే పరిస్థితి లేదని మండిపడ్డారు. పది రోజుల్లో తిరుమలగిరి గ్రామంలో రోడ్ల మరమ్మతులు చేపడితే ప్రజలు సంతోషిస్తారని, లేకుంటే పనులు నిర్వహించే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పార్టీల నాయకులు, యువజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో సుమన్ రాజేష్, ప్రతాప్, దేవేందర్, రమేష్, కుమారస్వామి ఉన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో బంగారు భవిష్యత్తు

## జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మహబూబాబాద్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ అన్నారు. తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామంలోని అమ్మాపురం క్లస్టర్ గ్రామ రైతులతో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీహెచ్ఎస్ఓ సూర్యనారాయణ మాట్లాడుతూ సాంప్రదాయ నూన గింజల ఆయిల్ పామ్ పంట నూనె దిగుబడి 4 నుంచి 5 రెట్లు అధికంగా ఉంటుందని, ఆయిల్ పామ్ మొక్కలు నాటిన తర్వాత 4 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వరకు నిరంతర దిగుబడితో ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. తెగుళ్లు, చీడపీడలు ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగులో చాలా తక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. ఆయిల్ పామ్ పంట తుఫాను, వడగండ్ల వానలు మొదలగు ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకుంటుందని దీనికి కోతుల బెడద, అడవి పందుల బెడద, దొంగల బెడద ఉండదని పేర్కొన్నారు. ఈ సాగులో ఖర్చు చాలా తక్కువగా, కూలీల అవసరం చాలా తక్కువ వరకు ఉంటుందని, ఒక వ్యక్తి పది ఎకరాల ఆయిల్ పామ్ తోటను సులువుగా పర్యవేక్షించొచ్చని ఆయన అన్నారు. మొదటి మూడు సంవత్సరాలు ఆదాయం కోసం అంతర పంటలుగా కూరగాయలు, మొక్కజొన్న, పత్తి బొబ్బర్లు, పెసర్లు,కందులు, ఉలువలు,పొద్దు తిరుగుడు, అరటి, బొప్పాయి, వేరుశనగలాంటి పంటలు పండించవచ్చన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత కూడా కోకో, పొట్టి మిరియాలు, మొదలగు పంటలను అంతర పంటలుగా పండించి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఆయన తెలిపారు. రైతు పండించిన దిగుబడిని రైతు పొలాల నుంచి నేరుగా ఫ్యాక్టరీ కి తరలించిన వారి గెలల రవాణా చార్జీలను ప్రభుత్వ రంగ సంస్థ టీఎస్ ఆయిల్ ఫెడ్ సంస్థ భరిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటల సాగు చేసే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ పంట యాజమాన్యం అంతర పంటల సాగుపై రాయితీలు కూడా కల్పిస్తుందని, దీంతో పాటు డ్రిప్పు పరికరాలపై సబ్సిడీ కూడా ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ రాకేష్, మండల వ్యవసాయ అధికారి కుమార్, గుర్తూరు గ్రామ సర్పంచ్ రవీంద్ర చారి, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు తమ్మెర వీరభద్ర రావు, వ్యవసాయ విస్తరణాధికారులు దీపిక, జమున, అమ్మాపురం గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గూడెల్లి యాకయ్య, రైతులు తీగల సంజీవరెడ్డి, గట్టు వెంకన్న, ముదుపు రాజిరెడ్డి, పుల్లారెడ్డి, చీకటి వెంకన్న, బానోత్ సోమల నాయక్, గుగులోతు రమేష్ నాయక్, టీఎస్ ఆయిల్ ఫెడ్ సంస్థ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులను బేషరతగా క్రమబద్ధీకరించాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** నేషనల్ హెల్త్ మిషన్ కింద జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ మేనేజర్, స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, అకౌంటెంట్స్ , సపోర్టింగ్ స్టాఫ్ మెడికల్ అసిస్టెంట్, ఎంఎన్ఓ, వాచ్ మెన్, స్వీపర్ , డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ లో పనిచేస్తున్న అల్ క్యాడర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్ల ఉద్యోగుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. యూపీహెచ్ సీ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వరంగల్ జిల్లాలో 9వరోజు సమ్మె సందర్భంగా ముఖ్య అతిథులుగా బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్ రాములు పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఆగస్టు 31న యూపీహెచ్ సీ సమ్మె ప్రారంభించి వరంగల్ జిల్లా డీఎంహెచ్ఓ ఆఫీస్ ముందు కొనసాగిస్తున్నారన్నారు. శుక్రవారం ఒంటికాలుపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి దామర కృష్ణ , జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ యాకూబ్, జిల్లా ప్రజా నాట్యమండలి, జిల్లా నాయకులు బోళ్ల వసంత, కుంట శాంతి, ఎన్ హెచ్ఎం రాష్ట్ర నాయకులు సరిత, ఎన్ హెచ్ఎం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీబాద్రి వేణు , మార్క రాజేష్ గౌడ్, బి.అనూష , విజేత, ఓ.సందీప్ కుమార్, శ్యామ్ కుమార్, రమాదేవి, మానస, రాజేష్, రామనాథం, కళ్యాణి , సుష్మ, రాకేష్, బైరి అశోక్, చైతన్య, ఎన్ హెచ్ఎం వరంగల్ నాయకులు చిరంజీవి, పీ.శ్రీధర్, మౌనిక, శ్రీనివాస్ బాబు, ప్రశాంత్, నూకల అంజయ్య, కుమార్, సతీష్ కుమార్, అభిషేక్, మాధవ్ రావు, శ్రీనివాస్, బండి రాజేష్, లావణ్య, జ్యోష్న, స్పందన, శైలజ, మంజుల, సుజాత, శోభారాణి, రజియా, సంపత్ కుమార్, స్వప్న, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తానని, తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్ టీయూ అనుబంధం) జిల్లా అధ్యక్షుడు వేర్పుల మహేందర్ అన్నారు. శుక్రవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుంచి మున్సిపల్ కార్మికులుగా విధులు నిర్వహిస్తూ కార్మికుల సమస్యలపై స్పందిస్తున్న నాపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అంకితభావంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పగలనకా రాత్రనకా కృషి చేస్తానని అన్నారు. వృత్తిపరంగా ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన నాకు తెలియజేస్తే ఆ సమస్య పరిష్కరించే దిశగా కృషి చేస్తానని మున్సిపల్ కార్మికులకు సూచించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన సంఘం జిల్లా బాధ్యులకు కార్మికులకు జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తొర్రూరు ఎంపీపీ చిన్న అంజయ్య అన్నారు. మండలంలోని పెద్ద మంగ్యా తండా గ్రామ పంచాయతీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక సర్పంచ్ జాటోత్ శారద రమేష్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రీడా వస్తువులు, ప్యాడ్లు,పెన్నులను ఎంపీడీవో సింగారపు కుమార్ తో కలిసి అందజేశారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. విద్యార్థులకు విద్య, క్రీడా సామాగ్రిని పంపిణీ చేసిన సర్పంచ్ శారదా రమేష్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ యుగేందర్, పీఏసీఎస్ డైరెక్టర్ జాటోత్ టికు నాయక్, బీఆర్ఎస్ నాయకులు బత్తుల యాకయ్య, పంచాయతీ కార్యదర్శి నీరజ, ఉపసర్పంచ్ తుకారాం, పార్టీ గ్రామ అధ్యక్షుడు లచ్చిరాం, పాఠశాల హెచ్ఎం మాలతి, అంగన్వాడీ టీచర్లు శాంతి, సుజాత, స్థానికులు కిషన్, నారాయణ, మోహన్ పాల్గొన్నారు.

# ప్రజలందరికీ రుణపడి ఉంటా..

## ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**వరంగల్ వాయిస్, పరకాల :** క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల క్యాంప్ కార్యాలయంలో మహిళలు బోనాలతో ఆట పాటలతో నృత్యాలు చేశారు. ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపు ఖాయమని, అభివృద్ధి చేసిన నాయకుడి వెంట ఉంటామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు మాట్లాడుతూ ఇంత పెద్ద సంఖ్యలో నన్ను ఆశీర్వదించడానికి విచ్చేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. మీ ప్రేమాభిమానాలకు నేను ఎల్లప్పుడూ రుణ పడి ఉంటానని, మీకు మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. అలాగే సంగెం మండల కేంద్రంలో ఘనంగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. గీసుగొండ మండలంలోని పీడీఆర్ గార్డెన్స్ లో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హాజరుకాగా కొమ్మాల శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని జీఆర్ కే ఫంక్షన్ హాల్లో పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమాన నాయకునికి గజమాలతో సత్కరించి,కేక్ కట్ చేసి వారి అభిమానాన్ని చాటుకున్నారు.



**ఖండంతారాలు దాటిన అభిమానం..**

పరకాల అభివృద్ధి ప్రదాత ,శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి బర్త్ డే సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగానే కాకుండా రాష్ట్రంలో ఉన్న అభిమానులందరూ ఆయన పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ క్రమంలో ఖండంతరాలు దాటి మరి అమెరికాలో ఆయన పుట్టిన రోజు వేడుకలు జరుగుతున్నాయి. అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉన్న టైమ్స్ స్క్వేర్ ప్లాజా నందు చల్లా అభిమానులు లెనిన్ గౌడ్, స్టాలిన్ పలువురు ఘనంగా జన్మదిన వేడుకలు జరిపారు. అక్కడున్న స్క్రీన్ పై ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వీడియోను ప్రదర్శిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాలు, ఆశా వర్కర్స్, నాలుగు మండల ప్రజాప్రతినిధులు, పరకాల పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫిజియోథెరపితో త్వరగా కోలుకోవచ్చు




**వరంగల్ వాయిస్, రేగొండ :** మండలంలోని లింగాల గ్రామంలో శుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపి దినోత్సవాన్ని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ఉచిత శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాల గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి విజయ లక్ష్మీ, ఉపసర్పంచ్ కోసరి నరేందర్, స్కూల్ హెడ్మాస్టర్ సత్యనారాయణ స్వామి ముఖ్య అతిథులుగా విచ్చేసి ఫిజియోథెరపీ శిబిరాన్ని ప్రారంభించారు. లింగాల గ్రామ సర్పంచ్ మామిడి శెట్టి విజయలక్ష్మి మాట్లాడుతూ వయసు రీత్యా గ్రామంలో చాలామంది పెద్దలు మోకాళ్ల నొప్పులు, మెడ నొప్పి, తొంటి నొప్పులతో బాధపడుతున్నారని, వారందరూ ఈ శిబిరానికి విచ్చేసి వైద్యం చేయించుకోవాలని తెలియజేశారు. వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ యజమాన్యం గ్రామంలో ఫిజియోథెరపి శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు గాను కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామ్ రెడ్డి, క్లినికల్ హెడ్ డాక్టర్ చిరంజీవి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ రాజమహేంద్ర, డాక్టర్ సాయికిరణ్, ఎముకల వైద నిపుణులు డాక్టర్ బెంజమిన్, సుమారు 150 మందికి పరీక్షలు నిర్వహించి పిజియోథెరపి చికిత్సను అందించారు. ఈ కార్యక్రమంలో మామిడిశెట్టి మహేందర్, వార్డు మెంబర్ ఆకుల ఐలయ్య, స్కూల్ చైర్మన్ దొంగల కృష్ణమూర్తి, పెరల తిరుపతి, డాక్టర్ సాధ్విక, కృష్ణప్రియ, కటకం శంకర్, ఫిజియోథెరపి వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల ప్రారంభం



**వరంగల్ వాయిస్, మడికొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 46వ డివిజన్ మడికొండ పరిధిలోని ఎస్సీ, బీసీ కాలనీ(బుడిగ జంగాల కాలనీ)లలో డ్రైనేజీ, రోడ్లు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ ప్రారంభించారు. శుక్రవారం కాలనీలో కుడా నిధులతో కోటి రూపాయల వ్యయంతో చేయతలపెట్టిన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. డివిజన్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 46వ డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్ కుమార్, పట్టణ శాఖ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్, బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ నర్మెట భిక్షపతి గాండ్ల, ఉపాధ్యక్షులు కొలిపాక కుమార్ బాబు, బీసీ సెల్ అధ్యక్షుడు పల్లపు కుమార్ రాజ్, ప్రధాన కార్యదర్శి తూర్పాటి అబ్బ సాయిలు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు గోపనబోయిన రాజు, సీనియర్ నాయకులు వస్కుల దేవేందర్, రాసమల్ల రాజు, దుబాసి పద్మారావు, కాలేశ్వరపు రాజేందర్, పార్టీ శ్రేణులు పల్లపు రాజకుమార్, జాన్,ఆరూరి తిరుపతి, కడమంచి మహేందర్, నమిండ్ల స్వామి ఎస్సీ,బిసి కాలనీ, బుడగ జంగాల కాలనీ ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ ఫార్మసీ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్




**వరంగల్ వాయిస్, కాజీపేట :** సోమిడి శివారులోని నేతాజీ ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ ను ప్రముఖ ఫార్మా స్యూటీకల్ ఇండస్ట్రీ ఎంఎస్ఎన్ ల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ ఆధ్వర్యంలో కళాశాల చైర్మన్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ రాకేష్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.బాబురావు, ప్రారంభించారు. ఈ ఉద్యోగమేళాలో వివిధ కళాశాలల నుంచి సుమారు 200మందికి పైగా బీఫార్మసీ, బీఎస్సీ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్ గా ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. ఎంఎస్ఎన్ ల్యాబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున రాకేష్ కుమార్(సీనియర్ మేనేజర్ ప్రొడక్షన్), బి.వెంకటరెడ్డి (హెచ్ఆర్ బిజినెస్ పార్టనర్), కట్కూరి నవీన్ కుమార్ (హెచ్ఆర్ బిజినెస్ పార్టనర్), ఎస్.కిరణ్ (టాలెంట్ అక్విషన్ అండ్ ప్రొడక్షన్) సీహెచ్.జైపాల్ రెడ్డి(ప్రొడక్షన్ ఆపరేషన్స్), డి.ఆదిరెడ్డి (హెచ్ఆర్ డాక్యుమెంటేషన్ లీడ్) పాల్గొని విద్యార్థిని, విద్యార్థులకు ఎంఎస్ఎన్ లాబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అభివృద్ధి, ఔషధాలు తయారు చేసే విధానం గురించి అవగాహన కల్పించి రాత పరీక్ష, మౌఖిక పరీక్ష నిర్వహించి సుమారు 20మందికి జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీస్ గా ఆఫర్ లెటర్స్ అందజేశారన్నారు. మరి కొంతమందిని షార్ట్ లిస్ట్ చేసి, వారిని మరొక రౌండ్ కి 15రోజులలో అటెండ్ కావాల్సిందిగా తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థిని, విద్యార్థులను కళాశాల చైర్మన్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ రాకేష్ రెడ్డి, ప్రిన్సిపల్ బాబురావు అభినందించి ప్రశంసా ప్రతాలను అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఇంచార్జ్ టి.శ్రీకాంత్, డాక్టర్ మహమ్మద్ రవూఫ్, అధ్యాపకులు డాక్టర్ పావని, డాక్టర్.భార్గవిలత, డాక్టర్.సుస్మిత, సునీల్, అనిల్ కుమార్, రవళి, పల్లవి, శ్వేత, అర్చన, శశాంక, రచన, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే కఠిన చర్యలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, ర్యాలీలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఇన్ స్పెక్టర్ ఎన్ కరుణాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాన్యమైన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తేలా, ప్రజాశాంతికి, జనజీవనానికి ఆటంకం కలిగించేలా, ప్రజలతో పాటు , వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే విధంగా చట్ట వ్యతిరేకంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆకస్మికంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, సభలు, ర్యాలీలు నిర్వహించే, పాల్గొన్న వ్యక్తులపై చట్ట పరంగా కేసులను నమోదు చేసి తగు చర్యలు తీసుకోంటాయన్నారు. అదేవిధంగా ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు, ర్యాలీలు చేసే వారు ముందస్తుగా పర్మిషన్ తీసుకోవడమే కాకుండా తలపెట్టిన కార్యానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని పొందు పరచవలసి ఉంటుందన్నారు. ఆ కార్యక్రమానికి సంబంధించి సౌండ్ సిస్టం (డీజే) లేదా బాణాసంచా కాల్చడానికి కూడా అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అలా కాకుండా ఎవరైనా డీజే మ్యూజిక్ లేదా లౌడ్ స్పీకర్లు వాడినట్లయితే అవి ఏర్పాటు చేసిన సంబంధిత యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసి వాటిని సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నిబంధనలను ఎవరు ఉల్లంఘించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సీకేఎం కళాశాల గ్రంథాలయ విభాగం వారు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శశిధర్ రావు మాట్లాడుతు విద్యార్థులకు అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలుపుతూ మారుతున్న ప్రపంచ పోకడలకు అనుగుణంగా డిజిటల్ అక్షరాస్యత గురించి తెలుసుకోవాలన్నారు. తద్వారా స్థిరమైన, శాంతియుత సమాజాలను నిర్మించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి, గ్రంథ పాలకులు ఎస్.అనిల్ కుమార్, పూర్ణ చందర్, కుమార్, కరుణాకర్, సునీల్, రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, రాజేష్, సుమలత, వసుధ, ఉదయ, అరుణ, సునీత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే అరూరి రమేష్

**వరంగల్ వాయిస్, మడికొండ :** తెలంగాణలో పేద ప్రజల సంక్షేమం కోసం పూర్తి భరోసానిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండకు చెందిన నలుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2లక్షల 50వేల విలువగల చెక్కులను ఎమ్మెల్యే అరూరి రమేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందని తెలిపారు. ఆడపిల్లల ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు



తెలంగాణ పభ్రుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద చికిత్సకు తగిన ఆర్థిక సాయం బాధితులకు అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో వైద్యం, విద్యకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్షన్ల వేట





షారుఖ్ ఖాన్ , తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్ లో వచ్చిన 'జవాన్' శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విడుదలైంది. ఒక్క హిందీలోనే కాకుండా దక్షిణాది భాషలన్నింటిలోనూ భారీగా విడుదల చేశారు ఈ సినిమాని. ఇందులో నయనతార, విజయ్ సేతుపతి , దీపికా పడుకోన్, ప్రియమణి ఇలా చాలామంది నటీనటులు వున్నారు. ఈ సినిమాకి చాలా హైప్ కూడా వచ్చింది. అలాగే ఈ సినిమా ఒక పైసా వసూల్ సినిమా ని, మాస్ ఎంటర్ టైనర్ అని ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్ కూడా రికార్డు స్థాయిలో వుంటాయని ట్రేడ్ అనలిస్ట్స్ ఊహించారు. అందరి ఊహలకు అనుకున్నట్టుగానే ఈ సినిమా మొదటి రోజు రికార్డు కలెక్షన్స్ సృష్టించి ఒక కొత్త రికార్డు నెలకొల్పింది. ఇంతకు ముందు విడుదలైన సన్నీ డియోల్ నటించిన 'గదర్ 2' , షారుఖ్ ఖాన్ సినిమా 'పఠాన్' కలెక్షన్స్ ని మించి 'జవాన్' మొదటి రోజు కలెక్షన్స్ వున్నాయి. ఇప్పటివరకు ఏ సినిమా కూడా మొదటి రోజు ఇంత కలెక్షన్స్ సాధించలేదు అనేంతగా ఈ 'జవాన్' సినిమా సాధించని అని చెపుతున్నారు. మీడియాలో వస్తున్న కథనాల ప్రకారం 'జవాన్' సినిమా మొదటి రోజు సుమారు రూ.75 కోట్ల రూపాయల నెట్ కలెక్టు చేసిందని, ఇందులో తమిళ, తెలుగు భాషల నుంచి చెరో రూ.5 కోట్ల వరకు కలెక్టు చేసిందని ట్రేడ్ అనలిస్ట్స్ చెపుతున్నారు. అంటే ఇంతవరకు ఏ సినిమా ఇలా మొదటి రోజు ఇంత పెద్ద మొత్తంలో కలెక్టు చెయ్యలేదని కూడా అంటున్నారు. షారుఖ్ ఖాన్ 'పఠాన్' మొదటి రోజు రూ.57 కోట్లు కలెక్టు చేసిందని, 'వార్' సినిమా రూ.53 కోట్లు కలెక్టు చేస్తే, 'కెజిఫ్' రూ.54 కోట్లు కలెక్టు చేసిందని ఈమధ్యనే విడుదలైన 'గదర్ 2' రూ.40 కోట్లు కలెక్టు చేసినట్టుగా చెపుతున్నారు. 'జవాన్' రెండో రోజు కూడా కలెక్షన్స్ బాగుంటాయని ఆశిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికి చూస్తున్న అడ్వాన్స్ బుకింగ్స్ బట్టి ఈ సినిమా రెండో రోజు కూడా రికార్డు కలెక్షన్స్ వుంటాయని అనుకుంటున్నారు. ఈ విధంగా చూసుకుంటే రేపు శని, ఆదివారాలు కూడా ఈ సినిమా కలెక్షన్స్ విపరీతంగా వుండే అవకాశం వుంది అని చెపుతున్నారు. 'జవాన్' సినిమా షారుఖ్ ఖాన్ కి కెరీర్ బెస్ట్ అవుతుందని కూడా అంటున్నారు. ఇక నయనతార మొదటిసారిగా ఇంత పెద్ద విజయంతో హిందీలో ఆరంగేట్రం చేసింది.

## గీతా ఆర్ట్స్ నుంచి
# కోటబొమ్మాళి పిఎస్



'భలే భలే మగాడివోయ్', 'గీత గోవిందం' 'టాక్సీవాలా', 'ప్రతి రోజు పండగే', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' లాంటి అనేక విజయవంతమైన సినిమాలను నిర్మించిన గీతా ఆర్ట్స్ సంస్థ మంచి పేరు తెచ్చుకుంది. ఇప్పుడు తాజాగా మలయాళంలో సూపర్ హిట్ అయినా 'నాయాట్టు' అనే సినిమాని తెలుగులో 'కోట బొమ్మాళి పిఎస్' పేరుతో రీమేక్ తీసి విడుదల చేస్తున్నారు. ఈ సినిమాకి నిర్మాతలుగా బన్నీ వాస్, విద్యా కొప్పినీడి వ్యవహరిస్తున్నారు.ఈ తెలుగు రీమేక్ లో సీనియర్ నటుడు శ్రీకాంత్ మేక ప్రధాన పాత్రలో కనిపిస్తుండగా, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రత్యేక పాత్రలో నటిస్తోంది. అలాగే రాహుల్ విజయ్ , శివాని రాజశేఖర్ లు కూడా రెండు కీలక పాత్రల్లో కనపడనున్నారని తెలిసింది. ఈ సినిమా మోషన్ పోస్టర్ ఆమధ్య విడుదల చేశారు, అది కొంచెం ఆసక్తిని పెంచింది. అయితే ఈ ప్రచారాలని కొంచెం ఎక్కువ చెయ్యాలని తలచి, ఈ సినిమా నుండి ఒక పాటను విడుదల చెయ్యాలని నిర్మాతలు భావించారు. అందుకోసమని ఒక ప్రత్యేక పాటని ఈ సినిమా నుండి ఈ నెల అంటే సెప్టెంబర్ 11న విడుదల చేయను న్నారని ప్రకటించారు. అయితే ఈ పాట శ్రీకాకుళం యాసలో వుండే ఒక ఆసక్తికర పాట అని, పూర్తిస్థాయి ఫోక్ సాంగ్ తో వస్తున్న ఈ పాట ప్రేక్షకుల్ని అలరిస్తుందని చెపుతున్నారు దర్శకర్మాతలు. 'జోహార్', 'అర్జున ఫాల్గుణ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపునందుకున్న తేజ మార్నిఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.





## యూట్యూబ్‌లో రికార్డు సృష్టించిన
# శ్రీమంతుడు

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ప్రధాన పాత్రలో వచ్చిన బ్లాక్ బస్టర్ చిత్రం శ్రీమంతుడు కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కింది. ఈ మూవీ 2015 ఆగష్టు 7న విడుదలై సంచలన విజయం నమోదు చేసుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద ఏకంగా 140 కోట్లు కలెక్ట్ చేసింది. ఇక ఈ సినిమాతోనే గ్రామాలను దత్తత తీసుకోవడం పాపులర్ అయ్యింది. ఇదిలా ఉండగా.. ఈ చిత్రం అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ మూవీ యూట్యూబ్‌లో రికార్డు సృష్టించింది. తాజాగా ఈ మూవీ యూట్యూబ్‌లో 200 మిలియన్స్ (20కోట్ల) వ్యూస్ దాటినట్లు మేకర్స్ సోషల్ మీడియాలో వెల్లడించారు. అయితే ఇందులో విశేషం ఏంటంటే యూట్యూబ్‌లో 200 మిలియన్ల వ్యూస్ దక్కించుకున్న తొలి తెలుగు చిత్రంగా శ్రీమంతుడు రికార్డు కొట్టింది. దీంతో మహేశ్ బాబు ఫ్యాన్స్ సోషల్ మీడియాలో ఫుల్ ఖుషి అవుతున్నారు. శ్రీమంతుడు మూవీ ఇప్పుడు కూడా రికార్డు సృష్టించిందని పోస్టులు చేస్తున్నారు. ఈ సినిమాలో శృతి హాసన్ హీరోయిన్‌గా నటించింది. జగపతి బాబు, సుకన్య, రాహుల్ రవీంద్రన్, పూర్ణ, సనమ్ శెట్టి కీలకపాత్రలు పోషించారు. ఈ సినిమాకి దేవీశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించాడు. కాగా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ ఈ సినిమాతోనే స్టార్ట్ అయ్యింది.


# బడుల్లో ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్

**ఈ నెల నుంచే అమలుకు ప్రభుత్వం చర్యలు**

**టీఎస్‌ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా నమోదుకు శ్రీకారం**

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఇక సర్కార్ పాఠశాలల్లో 'ఫేషియల్ రికగ్నేషన్ అటెండెన్స్' విధానం అమల్లోకి రానుంది. రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉన్న ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులందరికీ ఫేస్ రికగ్నేషన్ హాజరు విధానం (ఎఫ్ఆర్ఏఎస్) అమలు కానుంది. ఈ విధానంపై ఇప్పటికే సర్కార్ కసరత్తు ప్రారంభించిన సంగతి తెలిసిందే. టీఎస్‌ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా ఈ నెల నుంచే అమలుకు శ్రీకారం చుట్టింది. కీలమైన సాఫ్ట్ వేర్ టెండర్లను ఆర్ఎన్ఐటి సర్వీస్ అండ్ సోల్యూషన్స్ అప్పగించటంతో పాఠశాలల్లో ఈ విధానం అమలుపై సర్కార్ ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ, పంచాయతీరాజ్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, తెలంగాణ గురుకుల విద్యాసంస్థల్లోని విద్యార్థులందరికీ ఫేస్ రికగ్నేషన్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నారు. సెప్టెంబర్ మాసం నుంచి దీనిని ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే విద్యార్థులు, టీచర్లతో పాటు ఇతర సిబ్బంది కూడా దీని ద్వారనే హాజరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నూతన హాజరు విధానం సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలను ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

దేశంలోని ఆంధ్రప్రదేశ, గుజరాత్, ఢిల్లీ, నాగాలాండ్ తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ఫేషియల్ రికగ్నేషన్ విధానం ఇప్పటికే అమలవుతోంది. తెలంగాణ సర్కార్ కూడా ఆ దిశగా ఆలోచన చేసింది. పలు పాఠశాలలను ఎంచుకొని పైలెట్ ప్రాజెక్ట్ ను కూడా అమలు చేసింది. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నందున రాష్ట్ర మంతటా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చింది. ఆ తర్వాత టెండర్లను కూడా పిలిచింది. మరోవైపు ఇప్పటికే టీచర్లకు ట్యాబ్‌ల పంపిణీ పూర్తయింది. ప్రస్తుతం సాఫ్ట్ వేర్ ట్యాబ్‌లలో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ముఖ ఆధారిత హాజరు విధానం అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇది పూర్తిగా ఏఐ ఆధారంగా పనిచేస్తుంది.




రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 42 వేల ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ ఉండగా ఇందులో నుంచి 26,815 ప్రభుత్వ పాఠశాలల్లో 23,35,952 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్మార్ట్ ఫోన్, ట్యాబ్‌లలో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి కెమెరా ఆధారంగా స్కాన్ చేయగానే ముఖాలను గుర్తించి దానికదే హాజరు నమోదు చేస్తుంది. వెయ్యిలోపు విద్యార్థులున్న బడికి ఒకటి, వెయ్యి కంటే అధికంగా విద్యార్థులున్న స్కూళ్లకు రెండు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ ట్యాబ్‌లలో ఫేషియల్ రికగ్నేషన్ యాప్‌ను నిక్షిప్తం చేసి, వీటి ఆధారంగా హాజరును నమోదు చేస్తారు. ప్రధానంగా ట్యాబ్ లలో విద్యార్థులు, టీచర్ల యాప్‌లో లోడ్ చేస్తారు. ఫలితంగా క్లాస్ టీచర్ స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ కెమెరాను తెరిచి మొత్తాన్ని స్కాన్ చేయగానే ఎఫ్ఆర్ఎస్ అప్లికేషన్, కాగ్నిటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి, డాటాబేస్‌లో ఉన్న చిత్రాలలో పోల్చుకుంటుంది. ఆయా ముఖాల ఆధారంగా క్లాసుకు ఎంత మంది హాజరయ్యారనే దానిపై లెక్క తేలుస్తుంది. తక్కువ హాజరుశాతం ఉంటే అలర్ట్ కూడా జారీ చేసే విధానం ఇందులో ఉంటుంది. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వారి మొబైల్ ఫోన్లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. దాని ఆధారంగా హాజరును విద్యాశాఖకు పంపించాల్సి ఉంటుంది. అయితే ప్రతి పీరియెడ్‌కు కాకుండా మొదటి పీరియెడ్‌కే ప్రస్తుతానికి ఈ హాజరును వర్తింపచేయనున్నారు. భవిష్యత్తులో అన్ని పీరియెడ్లకు వర్తించే అవకాశమున్నది.

# నవ యుగ వైతాళికుడు కాళోజీ

**ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**ఆయన జయంతిని ఘనంగా నిర్వహించాలంటూ ఆదేశం**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణ రావు జయంతిని ఈనెల 9న ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ చీఫ్ విప్, పశ్చిమ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ కోరారు. కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ , కలెక్టర్ సిక్తా పట్నాయక్, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కాళోజీ ఫౌండేషన్ సభ్యులతో శుక్రవారం ఆయన హోటల్ హరిత కాకతీయలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... కాళోజీ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. కాళోజీ చరిత్రను తెలిపేలా కార్యక్రమాలు రూపోందించాలని, సాంస్కృతిక కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాళోజీ చిత్రమాలికలతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని కోరారు. కాళోజీ నారాయణ రావు అవార్డు అందజేత కార్యక్రమాన్ని అన్ని హంగులతో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ సభ్యులు అంపశయ్య నవీన్, విద్యార్థి, అశోక్, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రిని కలిసిన ఎమ్మెల్యే నరేందర్

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** దుబాయ్ పర్యటన విజయవంతంగా పూర్తి చేసుకొని హైదరాబాద్ విచ్చేసిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలన శాఖ మంత్రి కేటిఆర్ ను వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శుక్రవారం హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో వరంగల్ తూర్పు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా రెండో సారి ప్రకటించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తూ ప్రజాసేవలో ముందుంటానని ఎమ్మెల్యే నరేందర్ తెలిపారు.



# విలువలు కాపాడుకోవాలి

**సీపీకి ఎమ్మెల్యే రఘునందన్ రావు సూచన**

**విద్యార్థులపై దాడిచేయడంపై సీరియస్**

**కేసును తప్పుతోవ పట్టిస్తున్నారంటూ ఆగ్రహం**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాకతీయ యూనివర్శిటీ విద్యార్థులపై పోలీసులు దాడి చేయడంపై దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు సీరియస్ అయ్యారు. కాళ్ళు చేతులు విరిగేలా పోలీసులు కొట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయపడిన విద్యార్థులను శుక్రవారం కూయూలో ఆయన పరామర్శించారు. సంఘటనకు సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ సీపీ రంగనాథ్ విలువలు కాపాడుకోవాలని, కేసును తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం సరికాదన్నారు. పీహెచ్ డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయంటూ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ఆందోళనకు దిగితే పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. విద్యార్థులను అరెస్టు చేస్తే పోలీస్ స్టేషన్ కాకుండా టాస్క్ ఫోర్స్ కార్యాలయంలోకి ఎందుకు తీసుకెళ్లారని ఆయన ప్రశ్నించారు. విద్యార్థులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించేంత అవసరం ఏమొచ్చిందన్నారు. సీపీ వ్యవస్థలను ఎందుకు మేనేజ్ చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. సీపీ రంగనాథ్ లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా? అంటూ ప్రశ్నించారు. ఈ కేసును సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని, సీపీపై కోర్టులో కేసులు వేస్తామని హెచ్చరించారు. విద్యార్థులపై పోలీసుల దాడిని సీరియస్ తీసుకున్న ఆయన ఘటనపై న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. విద్యార్థులను క్రిమినల్‌గా చిత్రీకరించాలనే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేయూ వీసీపై గవర్నర్ తమిళిసైకి ఫిర్యాదు చేస్తామన్నారు.

# ముగ్గురు ఇన్ స్పెక్టర్లు, 5 ఎస్సైలు బదిలీ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఇన్స్ స్పెక్టర్ల బదిలీచేస్తూ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎస్ లో ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న కె.సూర్య ప్రసాద్ మహిళా పోలీస్ స్టేషన్ 1కు, ఎండి ఉస్మాన్ షరీఫ్ ను వీఆర్ నుంచి స్పెషల్ బ్రాంచ్ కు, ఓ రమేష్ ను వీఆర్ నుంచి స్పెషల్ బ్రాంచ్ కు బదిలీ చేశారు. అదే విధంగా మామూనూర్ ఎస్సై ఎన్.క్రిష్ణ వేణిని కాజీపేటకు, ఎం.రమేష్ పరకాల నుంచి కాజీపేటకు, జి.వెంకన్నను ఇంతేజార్ గంజ్ నుంచి మిల్స్ కాలనీకి, బి.హరికృష్ణను స్టేషన్ ఘన్ పూర్ నుంచి మిల్స్ కాలనీకి, ఎండి.తాజ్ మహమ్మద్ కాజీపేట్ నుంచి వీఆర్ కు బదిలి చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# సమస్యాత్మక కేంద్రాల సమాచారం ఇవ్వండి

**ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్నికల వ్యయ నియంత్రణలో భాగంగా సున్నితమైన, సమస్యాత్మకమైన కేంద్రాల నివేదికను సత్వరమే రూపొందించాలని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎన్నికల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్ నందు సీపీ రంగనాథ్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రవీణ్యా, మున్సిపల్ కమిషనర్ రిజ్వానా బాషాలు ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలు లేకుండా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. సహాయ వ్యయ నియంత్రణ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, అకౌంటింగ్ టీం సభ్యులు ఎన్నికల నియంత్రణను పర్యవేక్షించాలన్నారు. ఎన్నికలో డబ్బుల పంపిణీ, మద్యం నియంత్రణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్ నిఘా ఉంచాలని ఆదేశించారు.

గత ఎన్నికల్లో అక్రమంగా మద్యం, డబ్బు రవాణా జరిగిన రిపోర్ట్ ల ఆధారంగా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఏఈఓలు ప్రతి రోజు రిపోర్ట్స్ జిల్లా ఎన్నికల వ్యయ నియంత్రణ కమిటీ నోడల్ అధికారికి సమర్పించాలన్నారు. సీపీ రంగనాథ్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పోలీస్ అధికారులది కీలక పాత్ర అని, అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు, మహేందర్ జీ, అశ్విని తనజీ, డీఆర్ ఓ గణేష్, ఏసీపీ బారి, ఆర్డీఓ రమేష్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com